జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శుక్రవారం | 6-6-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 360 పేజీలు: 4 వెల : రూ.7


# పర్యావరణ పరిరక్షణ.. సామాజిక బాధ్యత

* 6 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
* భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందిద్దాం
* ప్లాస్టిక్ వినియోగంతో అనర్థం
* ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి
* కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
* జిల్లాలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**శ్రీకాకుళం, జూన్ 5 (వార్త):** పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతని, ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. భవిష్యత్తు తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025, వనమహోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలో జరిగిన భారీ ర్యాలీని కింజరాపు రామ్మోహన్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. పాత్రునివలస ఫ్లైఓవర్ నుంచి ఈ ర్యాలీ సాగింది. అనంతరం జిల్లాలో ఒక్కరోజులో 6 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. మొక్కలు నాటిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ మొక్క మానవాళి మనుగడకు జీవనాధారమన్నారు. మన భావితరాలకు ప్రాణవాయువు అందించాలంటే ప్రతి ఒక్కరూ తమ నివాస పరిసరాల్లో మొక్కలు నాటాలని కోరారు. నాటిన ప్రతి మొక్కను పెరిగి పెద్దదయ్యే వరకు సంరక్షించే బాధ్యతను మనమే తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం, శానిటేషన్ పై ప్రజల్లో అవగాహన పెరిగినప్పటికీ, దానిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మొదటిసారిగా అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో 6 లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం నిరంతర ప్రక్రియ కావాలన్నారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ చెట్లు విరివిగా ఉండడం ద్వారా మంచి వాతావరణం కలుగుతుందని, మొక్కలు నాటడమే కాదు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణ, మునిసిపల్ కమిషనర్ ప్రసాద రావు, మహిళా శిశు సంక్షేమ అధికారిణి శాంతిశ్రీ, జిల్లా అటవీశాఖ అధికారి ఎస్ వెంకటేష్, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, పాత్రునివలస ప్రెసిడెంట్, తెలుగు యువత సమన్వయకర్త మెండ దాసు నాయుడు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు వెంకటస్వామి, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నేడు మెగా డీఎస్సీ

* ఆన్‌లైన్ పరీక్షకు సర్వం సిద్ధం
* ఆరు కేంద్రాలు, 37,982 మంది అభ్యర్థులు
* ఒక్క నిమిషం ఆలస్యమైనా.. నో ఎంట్రీ
* రెండు సెషన్లలో పరీక్షలు
* డీఈవోతో కలెక్టర్ సమీక్ష

**శ్రీకాకుళం, జూన్ 5 (వార్త):** మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు జిల్లా అన్ని ఏర్పాట్లు చేసింది. ఆరు కేంద్రాల్లో 37982 మంది శుక్రవారం పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు రెండు సెషన్లలో నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది. జిల్లాలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు సమయానికి గంటన్నర ముందుగా కేంద్రం వద్దకు చేరుకోవాలి. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఈవో ఎస్.తిరుమల చైతన్య సమీక్షించారు. కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎచ్చెర్లలో శివానీ, వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలు, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ, రాజాంలో జీఎంఆర్‌ఐటీ, ఒడిశాలోని బ్రహ్మపురలో ఎస్ఎంఐటీ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిరోజు శుక్రవారం 4 కేంద్రాల్లో టీజీటీ కేటగిరీలో నిర్వహించనున్న పరీక్షకు ఉదయం 789 మంది, మధ్యాహ్నం 670 మంది హాజరు కానున్నారు. నరసన్నపేట కోర్ టెక్నాలజీ, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, ఒడిశాలోని బ్రహ్మపురలో ఎస్ఎంఐటీ ఆన్‌లైన్ కేంద్రం, రాజాంలోని జీఎంఆర్‌ఐటీ కళాశాలలో పరీక్ష జరుగుతుంది. అభ్యర్థుల హాల్‌టికెట్‌లో తప్పులుంటే వాటిని పరీక్ష కేంద్రాల్లో సరిచేస్తారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తీసుకెళ్లాలి. అక్కడున్న నామినల్ రోల్‌లో సరి చేస్తారు. హాల్‌టికెట్‌లో ఫొటో లేకపోతే రెండు ఫొటోలు, గుర్తింపు కార్డు తీసుకెళ్లాలి. అభ్యర్థుల్లో రెండు చేతులు లేని వారికి, దృష్టి లోపం ఉన్న వారికి స్క్రైబ్ ఏర్పాటు చేస్తున్నారు. సహాయ కేంద్రం ఏర్పాటు: అభ్యర్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా సహాయ కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. సహాయ సంచాలకులు 97031 48269, పరీక్షల విభాగ సహాయ కమిషనర్ 95056 78655, సీనియర్ సహాయకులు 89192 12126, కంప్యూటర్ ఆపరేటర్ 91779 75250 నంబర్లకు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

# పలాసలో.. అల్లుడి ట్యాక్స్



* మద్యంపై రోజుకు మూడు లక్షలు వసూళ్లు
* గ్రావెల్, ఇసుక, మట్టిని కూడా దోచేస్తున్నారు
* కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో సంక్షేమ పథకాలు గాలికి
* ప్రాణమున్నంత వరకూ ప్రజల తరపున పోరాడుతాం
* వెన్నుపోటు దినం సక్సెస్
* మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

**పలాస, జూన్ 5 (వార్త):** మద్యం షాపుల నిర్వాహకుల నుంచి ఈ అల్లుడికి పలాస నియోజకవర్గం నుంచి రోజుకు రూ.3లక్షలు వరకూ ట్యాక్స్ వస్తోందని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. గురువారం ప్రగతి భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లలో మద్యంపైనే రూ.60కోట్లు అనధికార వసూళ్లకు ఈ అల్లుడు రంగం సిద్ధం చేసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా సంక్షేమ పథకాలు ఇవ్వ కుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈనెల నాలుగో తేదీన జరిగిన వెన్నుపోటు దినంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని గ్రాండ్ సక్సెస్ చేశారన్నారు. ఎన్నికల ముందు అనేక పథకాలు ఇస్తామని, కూటమి నాయకులు ప్రజలను నమ్మించారని, అధికారంలోకి మోసగించారన్నారు. మందు, చికెన్, ఇసుక, గ్రావెల్ వంటి వాటిపై టాక్స్ రూపంలో ప్రజాధనాన్ని దోచుకుంటున్నారన్నారు. అమ్మకానికే ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేశారని మండిపడ్డారు. మద్యం బాటిళ్లపై రూ.10లు అదనంగా పెంచేసి దోచేస్తున్నారన్నారు. పలాస నియోజకవర్గంలో మట్టి ట్రాక్టర్‌పైన వంద రూపాయలు, టిప్పర్‌కు రూ.500లు ట్యాక్స్‌ను వసూలు చేస్తున్నారని, ఇదంతా ఎమ్మెల్యేకు తెలియకుండా జరుగుతుందా ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రాణమున్నంతవరకు పోరాడుతామన్నారు. వెన్నుపోటు దినానికి ప్రజలు భారీ సంఖ్యలో వచ్చారంటే ఈ కూటమి ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతోందన్నారు. రానున్నది వైసీపీ ప్రభుత్వమేనని మళ్లీ సంక్షేమ పథకాలు జగన్మోహన్ రెడ్డి హయాంలో విధిగా పంచుతామని, ఈ విషయమై ప్రజలు తెలుసుకోవాలని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు.

# తండ్రి కళ్లెదుటే.. కుమార్తె మృతి

* కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబీకులు





**బూర్జ, జూన్ 5 (వార్త):** తండ్రి కళ్లెదుటే కుమార్తె మృతి చెందడంతో ఆ తండ్రి పడిన బాధ వర్ణనాతీతం. ఈ ఘటన బూర్జ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆమదాలవలస పట్టణం ఐజే నాయుడు కాలనీకి చెందిన కాయల కేతన, తండ్రి కాళి దాసుతో కలిసి ద్విచక్ర వాహనంపై గుత్తావిల్లి నుంచి రాజాం పని నిమిత్తం బైక్‌పై వెళ్లారు. గుత్తావల్లి-లాభాం గ్రామ రహదారిలో ముందు వెళ్తున్న ఇటుకల ట్రాక్టర్‌ను తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో తండ్రి, కూతురు కిందపడిపోయారు. కేతన తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాళిదాసుకు చేతికి బలమైన గాయమైంది. కాళిదాసును రిమ్స్‌కు తరలించారు. మృతురాలి తల్లి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తోంది. సమాచారం అందుకున్నఎస్ఐ ప్రవల్లిక సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. కుమార్తె మృతితో ఆ కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



## వ్యాసరచనలో తేజశ్రీకి ప్రథమ బహుమతి

**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో నగరంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.తేజశ్రీ ప్రథమ బహుమతిని సొంతం చేసుకుంది. గురువారం పాత్రునివలసలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ ఆమెకు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తేజశ్రీని టీడీపీ సీనియర్ నాయకులు విభూతి సూరిబాబు ప్రత్యేకంగా అభినందించారు.



# రైతుల పక్షపాత ప్రభుత్వమిది

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**మందస, జూన్ 5(వార్త):** బాలిగాం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై విత్తనాలు, ఎరువులను ఎమ్మెల్యే గౌతు శిరీష రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మొక్కలను దున్నూరు, బాలిగాం గ్రామాల్లో ఎమ్మెల్యే శిరీష నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఏపీవో హరికృష్ణ, జీకే నాయుడు, భావన దుర్యోధన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, సాలిన మాధవరావు, ముంజేటి చంద్రశేఖర్, ముడుముంచి నవీన్ కుమార్, మామిడి తాతారావు, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బాలిగాం గ్రామ రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## వెన్నుపోటు, గొడ్డలి వేటుకు పేటెంట్ జగన్

**సరుబుజ్జిలి, జూన్ 5(వార్త):** వెన్నుపోటు,గొడ్డలి వేటుకు పేటెంట్ రైట్స్ జగన్ రెడ్డిదే, ఆస్తి కోసం తల్లిని. చెల్లిని మోసం చేసిన జగన్ కు ప్రజల్ని మోసం చేయడం ఓ లెక్క అని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ ధ్వజమెత్తారు. సరుబుజ్జిలిలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. రైతులను,శ్రామికులను, ఉద్యోగస్తులను, నిరుద్యోగులను అన్ని వర్గాలను వెన్నుపోటు పొడిచింది నీవు కాదా జగన్ ఆయన ప్రశ్నించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు మాట్లాడుతూ చంద్రబాబు గురించి మాట్లాడే అర్హత నీకు ఉందా జగన్ అన్నారు సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అంబలి రాంబాబు, మీసాల రామారావు, వెంకటరమణ, చిన్నాల అప్పారావు, సింహాచలం, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కళాకారులకు ఘన సన్మానం



**మందస, జూన్ 5(వార్త):** మూలిపాడు గ్రామంలో కళాకారులను సర్పంచ్ గుసిరి వెంకటరావుయాదవ్ గురువారం ఘనంగా సన్మానించారు. శ్రీముక్తేశ్వర ఆలయ సముదాయంలో సోంపేట మండలంలోని గొల్లపుట్టుగ గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా కళాకారులు హార్మోనియం బి.కాంతయ్య, తబలా నిరంజన్దొళాయి, గాత్రం దుంగ చిన్నయ్య, తెంబూరు వైకుంఠరావు, మురపాల జగన్నాథరావును శ్రీముక్తేశ్వరుని సన్నిధిలో పూలమాలలు వేసి, దుశ్శాలువలతో సత్కరించారు. ముక్తేశ్వరాలయ ప్రధాన అర్చకుడు ప్రఫుల్కుమార్ పాణిగ్రాహిని సన్మానించారు. కార్యక్రమంలో బొందల వెంకటరావు, ఎలుమల ప్రసాద్, పసుపురెడ్డి మురళీ, ముకుందరావు, ఎలుమల రాజారావు, పిట్ట భీమారావు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఏకాగ్రత..ఆరోగ్యం



**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** యోగాతో ఏకాగ్రతను పెంచుకోవచ్చని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ తెలిపారు. 80 అడుగుల రహదారిలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రోజూ యోగా చేయడం వలన ఆరోగ్యంగా ఉండొచ్చని చెప్పారు. యోగాపై అవగాహన పెంచుకోవాలన్నారు. యోగాసనాలతో మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు మురళీకృష్ణ, తంగి స్వాతి, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.

## భాస్కర్‌కుమార్‌ను సన్మానించిన ఎంపీహెచ్‌ఏలు



**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఎంపీహెచ్ఏ పునర్నియామకాల కౌన్సెలింగ్ సజావుగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్‌ను ఎంపీహెచ్ఏ యూనియన్ నాయకులు డి.సాయిప్రసాద్, ఎ.సత్యనారాయణ, పూజారి ధర్మారావు, లక్ష్మీనారాయణ, మురళి దుశ్శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు.

## యువ భారత్ సేవా ఫౌండేషన్ వార్షికోత్సవం

ఇచ్ఛాపురం, జూన్ 5(వార్త): తేలుకుంచి గ్రామానికి చెందిన యువ భారత్ సేవా ఫౌండేషన్ ఐదవ వార్షికోత్సవం గురువారం జరిగింది.ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. పంది పెద్దయ్య అనే వ్యక్తి కి రెండు వేల రూపాయల విలువ గల రేషన్ సరుకులు పంపిణీ చేశారు.



# ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** ప్రకృతి వ్యవసాయం బలోపేతానికి వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది జిల్లాలో గురువారం క్షేత్రస్థాయి పర్యటన జరిపారు.

రైతులు అవలంభిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. 0.5 సెంట్లలో పీఎండీఎస్ 32 రకాల విత్తనాలు రైతు మెట్ట ధనుజయ్ పొలంలో వేశారు. తమ్మినాయుడుపేటలో ప్రకృతి వనరుల కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం, విత్తన గుళికలు తయారు చేసి, వాటి లాభాలు, ఉపయోగాలు వివరించారు. ఈ శిక్షణ జిల్లా డీపీఎం పూజారి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కార్యక్రమంలో వ్యవసాయ సంబంధిత రీజినల్ ఆఫీసర్ హేమసుందర్, ఏడీపీఎం ధనుంజయ్ రావు, ఏడీ, ఏవో, వీఏఏ, వీహెచ్‌వో, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## నేటి నుంచి పెంటపోలమ్మ సంబరాలు

**పలాస, జూన్ 5,(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల పదోవార్డు పెంటవీధి-పొందరవీధిలో వెలసిన పెంటపోలమ్మ జామి జాతర శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పెంట సంజీతకుమార్, ఎస్.రూప్‌సుందర్, ఉమాకాంత్, కె.విజయ్, పి.శివ, నాగరాజు, భగీరధి, పెంట నవీన్, రాజేంద్ర, గిరి తెలిపారు. తొలిరోజున మహాభోగ నివేదన, అమ్మవారికి దర్శనం, 7న సహస్ర కుంకుమార్చన, 8న ముగ్రాటల, 9న గాజుల అర్చన, 10న ఘటోత్సవం, రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పలాస-కాశీబుగ్గ, పరిసర ప్రాంత ప్రజలు జాతర మహోత్సవం తిలకించి, అమ్మవారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.






# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**-లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలు అమోఘం**

**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** ప్రకృతిని పరిరక్షించేందుకు హరిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతీ పౌరుడు ఒక మొక్కను నాటి, దేశ పరిరక్షణలో భాగం కావాలన్నారు. గురువారం ఆయన తన బంగ్లాలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, డీసీ బాడాన దేవభూషణ్ , నూతన ఉపాధ్యక్షురాలు డా.పైడి సింధూర మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వద్దు, పర్యావరణానికి గుడ్డ సంచులు ముద్దని, గుడ్డ సంచులను కలెక్టర్ అందరికీ అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యదర్శి టెక్కం రాంగోపాల్, కోశాధికారి బి.కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.



**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో వృక్షార్పణ, ప్లాస్టిక్ శుద్ధి కార్యక్రమాలు గురువారం నిర్వహించారు.

కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, డా.అరుణ బాలాజీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ముని రామకృష్ణ, డీన్ అకడమిక్స్ శివరామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ కె.మోహనరావు, చీఫ్ వార్డెన్ నరసింహప్పడు, స్టూడెంట్స్ వెల్ఫేర్స్ డీన్ డా.గేదెల రవి, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ప్రసాద్ పట్నాయక్, సూపరింటెండెంట్ కనకరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



**శ్రీకాకుళం, జూన్ 5(వార్త):** ప్రకృతి లేకుండా జీవితం అసాధ్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత అన్నారు. గురువారం ఆమె ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమస్యలు పరిష్కారానికి చెట్లను నాటడం, వ్యర్థాలను తగ్గించడం లేదా పునరుత్పాదక శక్తిని అందించడం చేయాలన్నారు. పర్యావరణం కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకట్, డీవో డాక్టర్ రాందాసు, డెమో వెంకటేశ్వరరావు, ఎఫ్ఎల్‌సీ అప్పారావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**ఎల్ఎన్‌పేట, జూన్ 5(వార్త):** లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్ డా.ఎం.కె.మిశ్రో ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు శివాజీ పాణిగ్రాహి, ఉప సర్పంచ్ అశోక్ పాణిగ్రాహి, విశ్రాంత పోలీసు అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మొక్కలు నాటిన నందివాడ

**సరుబుజ్జిలి, జూన్ 5(వార్త):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని సరుబుజ్జిలి మండలం తెలికిపెంట పంచాయతీలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అప్పన్న, టంకాల హరి, ఈశ్వరరావు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.








**ఆమదాలవలస, జూన్ 5(వార్త):** బూర్జ మండలం పెద్దపేట గ్రామంలో ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యారణ పరిరక్షణ దినోత్సవంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ మెక్కలు నాటారు. అనంతరం ఆ సంస్థ వార్షికోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్ని మొక్కలను నాటితే మనకి అంత ఎక్కువ ఆరోగ్యం వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఆవరణలో ప్రదర్శించిన గిరిజన ఉత్పత్తులను పరిశీలించారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

ఆ సంస్థ సెక్రటరీ ఎన్.సన్యాసిరావుని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యం, ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, కూటమి ముఖ్య నాయకులు, గిరిజన సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రకృతి లేనిదే మానవ మనుగడ అసాధ్యం





**సరుబుజ్జిలి, జూన్ 5(వార్త):** ప్రకృతి లేకుండా జీవితం అసాధ్యమని మండల వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సాహితీ ప్రియదర్శిని తెలిపారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆమె తన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంపీడీవో కార్యాలయంలో..**

సరుబుజ్జిలి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పావని, జనసేన మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు అంబాల రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు గోవిందరావు, ఉపాధ్యక్షుడు తలగపు ధనుంజయ్‌రావు, పురుషోత్తపురం గ్రామ తెలుగుదేశం సీనియర్ నాయకులు కిల్లి లక్ష్మణరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**శ్మశానవాటికలో..**

సరుబుజ్జిలిలోని శ్మశానవాటిక వద్ద గురువారం టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యండ రామారావు, చందన అప్పారావు, యండ అన్నాజీరావు, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, వీవోఏ సీహెచ్ వరలక్ష్మి, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.





**టీడీపీ కార్యాలయంలో..**

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలు పేడాడ మణిమ్మ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు. సచివాలయం వద్ద సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మందస, జూన్ 5(వార్త):** పర్యావరణాన్ని కాపాడుదాం–జీవన ప్రమాణాన్ని పెంచుదామని ప్రజా విజ్ఞాన వేదిక సభ్యులు నినాదాలు ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హరిపురంలోని శ్రీ కుమార్ జూనియర్ కాలేజీలో ప్రజా విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో "పర్యావరణ–పరిరక్షణ" అనే అంశంపై జిల్లా స్థాయి కవితలు పోటీలను వేదిక కన్వీనర్ మార్పు జగన్మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. పోటీల్లో వివిధ మండలాల నుండి అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ ర్యాలీ చేసి అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హరిపురం, వీరభద్ర పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రజా విజ్ఞాన వేదిక సభ్యులు మామిడి కోదండరావు, దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచంలోని ప్రతి మూలలోకి చొరబడి, మనం త్రాగే నీటిలోకి, తినే ఆహారంలోకి, మన శరీరాల్లోకి చొరబడుతోందన్నారు. శ్రీ కుమార్ జూనియర్ కాలేజ్ డైరెక్టర్ దుమ్ము లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ దున్న తాతారావు మాట్లాడుతూ సముద్ర పర్యావరణంతో సహా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి ప్రపంచ ఒప్పందాన్ని సాధించే దిశగా దేశాలు పురోగతి సాధిస్తున్న తరుణంలో ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం రిపబ్లిక్ ఆఫ్ కొరియాలో జరుపుకుంటున్నారన్నారు. పోటీలలో విజేతలుగా నిలిచిన కె.రాజేష్, కరిష్మా, శ్రీకన్యలకు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు నల్ల హడ్డి, ఉమాపతి, తేజేశ్వరరావు, నారాయణరావు, మురళి, సోమలయ్య, నర్తు ప్రశాంత్ , ముడిమించి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546